క్లుప్తంగా

స్వీట్‌షాపులో అధికారుల ఆకస్మిక తనిఖీలు



కుషాయిగూడ: కాప్రా సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్, శానిటేషన్ సిబ్బందితో కలిసి సోమవారం హెచ్‌బీకాలనీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానికులకు అసౌకర్యం కలిగించడంతో పాటుగా అపరిశుభ్ర వాతవరణంలో స్వీట్లు తయారు చేస్తున్న ఓ స్వీటు షాపు యజమానికి నోటీసులు జారీ చేసి జరిమానా విధించారు. హెచ్‌బీకాలనీ ప్రధాన రోడ్డులో నిర్వహిస్తున్న ఓ స్వీట్స్ షాపు నిర్వాహకులు కనీస జాగ్రత్తలు పాటించకుండా స్వీట్లు తయారు చేస్తున్నారని, కట్టెల పొయ్యి కారణంగా చుట్టుపక్కల కాలనీలు పొగతో నిండిపోతున్నాయంటూ స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కాప్రా సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్, శానిటేషన్ సిబ్బందితో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. స్వీటు హౌజ్‌ను సందర్శించి స్వీట్ల తయారీని పరిశీలించారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా స్వీట్లు తయారు చేయడంతో పాటుగా పూర్తి అపరిశుభ్ర వాతవరణంలో తినుబండారాలు తయారు చేయడంపై అధికారులు, కార్పొరేటర్ ప్రభుదాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వీట్ల తయారీలో ప్రమాదకరమైన కెమికల్స్ వాడకంపై ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుట్‌పాత్ ఆక్రమణపై నిర్వాహకుడికి నోటీసులు జారీ చేసి రూ.11 వేల జరిమానా విధించినట్లు ఏఎంహెచ్‌ఓ డాక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు.

షాపింగ్ కాంప్లెక్స్‌కు మరమ్మతులు చేపట్టాలి



కాప్రా సర్కిల్ డీసీకి వినతిపత్రం ఇస్తున్న గగన్‌కుమార్

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ జై జవాన్ కాలనీలో ఇటీవలే జీహెచ్‌ఎంసీ స్వాధీనం చేసుకున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు మరమ్మతులు చేయాలని సమాచార హక్కు సాధన సమితి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్‌కుమార్ కోరారు. దీనిపై సోమవారం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషన్ జగన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవలే జీహెచ్‌ఎంసీ స్వాధీనం చేసుకున్న 10 కమర్షియల్ షటర్లు మరమ్మతులకు గురయ్యాయని, పనులు పూర్తి చేసిన తర్వాత టెండర్ ప్రక్రియ ద్వారా యాక్షన్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మల్లాపూర్: నాచారం ప్రతిభ హైస్కూల్‌లో 1999–2000 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు నాచారంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం (సిల్వర్ జూబ్లీ) నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత తమ స్నేహితులు, చదువు చెప్పిన గురువులను చూసి పూర్వ విద్యార్థులు మురిసిపోతూ.. ఆనందంగా వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

నల్ల చెరువు 'బేబీ పాండ్' ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజిత, జీహెచ్‌ఎంసీ అధికారులు

ఉప్పల్: ఉప్పల్ నల్ల చెరువు వద్ద 'బేబీ పాండ్'ను ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. నిమజ్జన కోలను వద్ద ఎలాంటి సమస్యలు ఎదురు కాకుండా ఉండేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. కొలను వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెద్ద విగ్రహాలను సైతం నిమజ్జనం చేసేలా కోలనును సిద్ధం చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు డీఈ చందన, డీఈ వినీల్‌గౌడ్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

అల్వాల్: ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ విభాగం సంయుక్తంగా ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు చేపట్టారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని ఇందిరా గాంధీ చౌరస్తా నుంచి ఈ–సేవ వరకు గల ప్రధాన రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలను సోమవారం తొలగించారు. ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ పంపిణీకి సన్నద్ధం!

- కొత్త కార్డులు పొందిన లబ్ధిదారుల సంఖ్య 26 వేలు
- సెప్టెంబర్ 1 నుంచి రేషన్ పంపిణీకి ఏర్పాటు పూర్తి

ఉప్పల్ రేషన్ సర్కిల్–2 పరిధిలో ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాలతో పాటు ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేట ప్రాంతాల్లో కొత్తగా మంజూరైన 26 వేల ఆహార భద్రత (రేషన్) కార్డు మంజూరైన లబ్ధిదారులకు సెప్టెంబర్ 1 నుంచి పాత, కొత్త రేషన్‌కార్డు లబ్ధిదారులకు 222 రేషన్ షాపుల్లో సన్నబియ్యంతో పాటు ఇతర సరుకులు అందనున్నాయి.

– రామంతాపూర్



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

ముగుస్తున్న మూడు నెలల కోటా

ఆగస్టు 15 వరకు మంజూరైన కొత్త రేషన్‌కార్డు లబ్ధిదారులకు మాత్రమే సెప్టెంబర్ కూడా విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. పాత రేషన్‌కార్డుల లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల కోటా కింద రేషన్ పంపిణీ జరిగింది. 3 నెలల కోటా ముగియడంతో సెప్టెంబర్ 1 నుంచి పాత రేషన్‌కార్డుదారులతో పాటు మంజూరైన కొత్త రేషన్‌కార్డు లబ్ధిదారులకు కూడా సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు రేషన్ పంపిణీ జరగనుంది.

ఆరోగ్యశ్రీ పథకం వర్తింపు

కొత్త రేషన్ కార్డు లబ్ధిదారులకు కూడా వెంటనే ఆరోగ్యశ్రీ సేవలు కూడా వర్తిస్తాయని అధికారులు వివరించారు. 2,03,230 లబ్ధిదారులకు రేషన్ పంపిణీకి సర్వం సిద్ధం చేశారు.

సన్న బియ్యం సరఫరాతో డబ్బు ఆదా

ఎన్నో ఏళ్లుగా రేషన్‌కార్డు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొత్త రేషన్‌కార్డు మంజూరు కావడం మా కుటుంబానికి చాలా సంతోషం కలిగించింది. కొత్త రేషన్‌కార్డు జారీ కావడంతో బయటి షాపుల్లో అధిక ధరలు పెట్టి బియ్యం కొనే బాధ తప్పింది. నెల నెల మా కుటుంబానికి డబ్బు ఆదా అవుతుంది.

– రజిత, నూతన లబ్ధిదారు, గణేష్‌నగర్

రేషన్ బ్యాగుల్లో బియ్యం పంపిణీ



సెప్టెంబరు 1 నుంచి ప్రారంభమయ్యే రేషన్ బియ్యంతో పాటు ఇతర సరుకులు తీసుకునే లబ్ధిదారులకు ఉచితంగా రేషన్ బ్యాగులను కూడా ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ బ్యాగుల్లో సన్న బియ్యంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల వివరాలు కూడా ఉంటాయి. ఇతర సరుకులు తీసుకోవడంలో సమస్య ఉంటే 9110393279.

– సంధ్య, అసిస్టెంట్ సివిల్ సప్లై రేషన్ ఆఫీసర్

ఓపికగా రేషన్ తీసుకోండి



సెప్టెంబర్ 1 నుంచి పాత, కొత్త రేషన్‌కార్డు లబ్ధిదారులకు రేషన్ బియ్యం సరుకులు పంపిణీ చేస్తారు. దీంతో రేషన్‌షాపుల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. రేషన్ కోసం వచ్చే లబ్ధిదారులు సంయమనం పాటించి, ఓపికగా క్యూలైన్‌లో నిలబడి రేషన్‌బియ్యం ఇతర సరుకులు తీసుకోవాలి. సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు రేషన్ షాపుల్లో పంపిణీ ఉంటుంది.

– శంకర్, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు

ధర్మ పరిరక్షణకు ఆలయాల అభివృద్ధి

ఎంపీ ఈటల రాజేందర్



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఈటల

మల్లాపూర్: మన సంస్కృతిని, సనాతన భారతీయ ధర్మాన్ని పరిరక్షించుకోవడానికి ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మల్లాపూర్ కేబుల్ చౌరస్తాలో రామానుజ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 54 అడుగుల విశ్వరూప అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణం సుందరీకరణ పనులకు సోమవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, శాంతిసాయిజెన్‌శేఖర్, రామానుజసేవాట్రస్టు చైర్మన్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురు యువకుల చేరిక..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ఉప్పల్: ప్రధాని నరేంద్ర మోదీ పాలనకు ఆకర్షితులైన పలువురు యువత ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి సోమవారం ఈటల పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఉప్పల్ గాంధీనగర్ ప్రాంతానికి చెందిన పలువురు యువకులు పార్టీలో చేరినట్లు డివిజన్ అధ్యక్షుడు మారినేని ఫణీందర్ తెలిపారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి, తీగ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ నూతన కమిటీ

బోడుప్పల్: చెంగిచర్ల గాంధీనగర్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా లింగయ్య, కోశాధికారిగా ప్రసాద్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. నూతన కమిటీని మాజీ ఉపసర్పంచ్, బీఆర్‌ఎస్ నేతలు కొత్త రవిగౌడ్ సత్కరించారు. కాలనీ అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బోడుప్పల్: యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో బోడుప్పల్‌కు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. పోటీల్లో పాల్గొన్న 13 మంది విద్యార్థులు స్వర్ణం, రజతం సాధించినట్లు సన్‌ఫైటర్ కుంగ్‌ఫూ మాస్టర్ నందప్రసాద్‌యాదవ్ వెల్లడించారు. సోమవారం బోడుప్పల్‌లో ఆయన మాట్లాడుతూ.. కుమార్, అభిషేక్, హర్షవర్ధన్, అమృత, వెంకటేష్, గౌతమ్, భరత్, వరుణ్, ఝాన్సీ, బాల, నీలకంఠ, లవణ్‌కుమార్, శ్రియ పతకాలు సాధించగా ముఖ్యఅతిథి చేతుల మీదుగా పతకాలను అందుకున్నట్లు వివరించారు.

ఆచూకీ లభ్యం

తల్లిదండ్రులకు చెంతకు తప్పిపోయిన బాలుడు

మల్లాపూర్: ఎస్వీనగర్‌లో తప్పిపోయిన బాలుడిని నాచారం పోలీసులు సోమవారం తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్లితే మల్లాపూర్‌కు చెందిన పాశ్వాన్, సవితల కుమారుడు నిషాత్‌కుమార్ (03) బయట ఆడుకుంటూ.. వెళ్లి అదృశ్యమయ్యాడు. కాగా ఎస్వీనగర్ కాలనీలో ఓ ఇంటి వద్ద ఏడ్చుకుంటూ ఉండగా.. బాలుడిని చూసిన స్థానికులు నాచారం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు బాలుడి ఫోటోను వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు రావడంతో వారికి అప్పగించారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి



జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బండారి

ఉప్పల్: నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్ పాటిల్‌ను కోరారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని మురికి వాడల్లో ఒకటైన చిలుకానగర్‌లోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, వరదనీటి కాలువల నిర్మాణం తదితర సమస్యలను డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ జడ్సీ దృష్టికి తీసుకు వచ్చారు. వీటితో పాటు ఐదు పార్కుల్లో ఒపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, మల్లికార్జున నగర్ వైపు ఉన్న ఇరిగేషన్ కాలువపై కల్వర్టును ఏర్పాటు చేయడానికి కూడా నిధులు కెటాయించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేసారు. అందుకు జడ్సీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు

కాప్రా: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి వారికి చేరువ కావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఏఎస్‌రావునగర్‌లో సోమవారం మెడికవర్ క్లినిక్స్‌ను స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య సేవలు అందించాలన్నారు. మహేష్ డెగ్లూర్కర్, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న కీసర ఆర్డీఓ వెంకటఉపేందర్

మేడిపల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాలకు మండప నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులను తీసుకోవాలని కీసర ఆర్డీవో వెంకటఉపేందర్ అన్నారు. సోమవారం మేడిపల్లిలోని ఎంకేబీఆర్ ఫంక్షన్‌హాల్‌లో మేడిపల్లి, ఘట్‌కేసర్ మండల పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వివిధ విభాగాల అధికారులు, నిర్వాహకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకున్నాకే విగ్రహాలు పెట్టాలని, ఇది కేవలం సమాచారం కోసమే తప్ప.. ఎలాంటి ఉద్దేశం లేదన్నారు. బోడుప్పల్, పీర్జాదిగూడ కమిషనర్లు, మేడిపల్లి ఎమ్మార్వో హసీనా, మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి, ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడి రిమాండ్

రెండు ద్విచక్ర వాహనాలు, బంగారం రికవరీ

ఉప్పల్: ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్ ప్రాంతానికి చెందిన మందాడి ప్రశాంత్ సాగర్(40) కంప్యూటర్ హార్డ్‌వేర్‌గా పని చేస్తుంటాడు. కాగా డబ్బులు సరిపోకపోవడంతో సులువుగా డబ్బు సంపాదించాలనే దురాలోచనతో దొంగతనాల బాట పట్టాడు. ఏప్రిల్ 29న ఉప్పల్ పద్మావతి కాలనీకి చెందిన తనుశ్రీ గోష్ డీఎస్ఎల్ మాల్ వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్కు చేసింది. సదరు వాహనం కనిపించకపోవడంతో ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా సోమవారం ఉప్పల్ పోలీసుల తనిఖీల్లో అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. అసలు విషయం బయట పెట్టాడు. గతంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ సైతం చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. నిందితుడి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు, బంగారం రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: నియోజకవర్గ పరిధిలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మచ్చబొల్లారం డివిజన్ బాలాజీ ఎన్‌క్లేవ్‌లో రూ.7.5 లక్షలతో తాగునీటి పైపులైన్ అభివృద్ధి పనులు, రూ.8 లక్షలతో తిరుమల్ ఎన్‌క్లేవ్, భాగ్యనగర్ కాలనీ, భూగర్భ డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నేతలు అనిల్‌కిషోర్‌గౌడ్, జేఏసీ వెంకన్న, నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, డోలి రమేష్, పరమేష్, శోభన్‌బాబు, లక్ష్మణ్‌యాదవ్, అమీనుద్దీన్, యాదగిరిగౌడ్, సురేష్, భాగ్యానంద్, ఉస్మాన్, వంశీముదిరాజ్, హేమంత్‌పటేల్, శ్రీనివాస్, సూర్య ప్రకాష్‌రెడ్డి, మహేష్, జావేద్ కాలనీవాసులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, సాయిరెడ్డి, మల్లారెడ్డి, కవిత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి...

అల్వాల్: పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఉన్నాయని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అల్వాల్ మండల కార్యాలయం వద్ద సోమవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన కార్పొరేటర్లు శాంతి, సబితలతో కలిసి అందజేశారు. తహసీల్దార్ రాములు, మాజీ కార్పొరేటర్ మురుగేష్, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే..

మౌలాలి : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి గణేష్ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఆహ్వానం అందజేశారు. నేరెడ్‌మెట్ డివిజన్ జేజేనగర్‌లో బబ్బు అండ్ బ్రదర్స్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు దిలీప్‌సందీప్ నేతృత్వంలో గణేష్ నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారని వివరించారు. సానుకూలంగా స్పందించిన కేటీఆర్ గణపతి నవరాత్రి వేడుకలకు హాజరవుతానని హామీ ఇచ్చారు. ఉత్సవ సమితి ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు శాంతి, సబిత



కేటీఆర్‌ను గణపతి నవరాత్రులకు ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

పోలీసుల మార్గదర్శకాలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి

కుషాయిగూడ: గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు, వలంటీర్లు విధిగా పోలీసుల మార్గదర్శకాలను పాటించాలని కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండప నిర్వాహకులతో కుషాయిగూడ పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి అవగాహన కల్పించారు. మండపాలకు పోలీసుశాఖ అనుమతులు తప్పనిసరన్నారు. ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మండపాలను ఏర్పాటు చేసుకోవాలని కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరాజు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంకటేశ్వర్లు, ఎస్సైలు సుధాకర్‌రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవీ పీర్జాదిగూడ ఫీడర్ పరిధిలో సమ్మర్ యాక్షన్‌ప్లాన్ పనుల మరమ్మతుల కారణంగా 33/11కేవీ పీర్జాదిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ సత్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం వివేకానంద ఫీడర్ పరిధిలో పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మణికంఠనగర్, వివేకానందనగర్, శ్రీలక్ష్మినగర్, లెక్చరర్స్ కాలనీ, ఎన్ఐఎన్ కాలనీ, ఐఐసిటీకాలనీ, భీంరెడ్డి కాలనీ, అశోక్‌నగర్, గ్రీన్ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్కాజిగిరి: మౌలాలి సబ్‌స్టేషన్ 11 కేవీ మౌలాలి ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓల్డ్ మౌలాలి, ఎస్వీనగర్, హనుమాన్‌నగర్, డైమండ్‌హిల్స్, కస్తూరిబానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకట్‌రెడ్డి తెలిపారు.

వసంతపురి సబ్‌స్టేషన్ పరిధిలో..

11కేవీ బీజేఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11 కేవీ సాయిరాం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాయిపురికాలనీ, సత్యనారాయణ కేఫ్, బృందావన్ కాలనీ, యాదవ్‌నగర్, ఓల్డ్ మల్కాజిగిరి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గోపాల్ ప్రకటించారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించండి

మేడిపల్లి: ప్రభుత్వభూమిలో జరుగుతున్న భూ కబ్జాలను అరికట్టాలని ప్రజా సంక్షేమసంఘం సభ్యులు మేడిపల్లి ఎమ్మార్వో హసీనాకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడిపల్లి సర్వే నెంబర్ 103లో ఇళ్లు లేని పేద ప్రజల కోసం గతంలో మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ పేదలకు 179 పట్టాలను పంపిణీ చేశారు. ఈ పట్టాలను ఆసరాగా చేసుకుని భూ ఆక్రమణదారులు దొంగ పట్టాలను సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనిపై అనేకసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరారు. మేడిపల్లి వీరాంజనేయస్వామి ఆలయ పరధిలో ప్రభుత్వం ప్రతిపాదించిన చార్జింగ్ స్టేషన్ ఏర్పాటును విరమించుకోవాలన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వో ఉద్యోగ విరమణ

అల్వాల్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శోభారాణి ఉద్యోగ విరమణ చేశారు. సోమవారం అల్వాల్ పంజాబ్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమాగౌరి హాజరై డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శోభారాణికి పుష్పగుచ్ఛం అందచేసి జ్ఞాపికను అందజేశారు. గత 25 ఏళ్లుగా అందరితో కలుపుగోలు తనంతో ఉండి సేవాభావంగా అందరి మన్ననలు పొందారన్నారు. డాక్టర్ సత్యవతి, డాక్టర్ కౌశిక్, డాక్టర్ వినోద్, డాక్టర్ మల్లీశ్వరి, అల్వాల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపతులు పర్యావరణానికి మేలు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్



మట్టిగణపతులను అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి : మట్టి గణపతులతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని, పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలని మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ సూచించారు. కార్పొరేటర్ క్యాంపు కార్యాలయంలో కాలనీ, వెల్ఫేర్ సంఘాలకు మట్టి గణనాథుల విగ్రహాలను పంపిణీ చేశారు. సత్యనారాయణ, గోపీనాథ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శివగౌడ్, మల్లారెడ్డి, సంతోష్‌కుమార్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి 6 వేల విగ్రహాలు..

కాప్రా: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణనాథులను పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ సూచించారు. మట్టి గణపతి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఉచితంగా విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. దీనిలో భాగంగా కాప్రా సర్కిల్‌కు 6 వేల విగ్రహాలు సోమవారం సాయంత్రం చేరుకున్నాయి. శానిటరీ సూపర్ వైజర్ సుదర్శన్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపతుల సంఖ్యను పెంచాలని..

మల్కాజిగిరి: వినాయకచవితి పర్వదినం సందర్భంగా జీహెచ్‌ఎంసీ అందజేసే మట్టి గణపతుల సంఖ్యను పెంచాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ప్రజావాణిలో డీసీ జకియా సుల్తానాకు ఫిర్యాదు చేశారు.

ఆయన మాట్లాడుతూ.. ఏటా భక్తులకు పంపిణీ చేసే వినాయక విగ్రహాల సంఖ్యను తగ్గించడం సరికాదన్నారు. మరో ఐదు రోజుల్లో నిమజ్జనం ప్రారంభమవుతుందని ఇప్పటికీ రోడ్లపై గుంతలకు మరమ్మత్తులు చేయలేదన్నారు. అనేక చోట్ల పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, స్వచ్ఛత చర్యలు చేపట్టాలన్నారు.